రాచకొండ
రంగనాధశర్మ

సాయంత్రం....

ఆరుగంటలు కొట్టింది గోడగడియారం.

చీకటి తన పనిగా మూలమూలలా అలుముకుంటోంది. గుడిసెల్లో గుడ్డి దీపాలు ... మేడల్లో మెర్క్యూరీ దీపాలు....చీకటిని నెట్టివేయడానికి ప్రయత్నిస్తున్నాయ్....బజారు చేరడానికి కొంతమంది వెళ్తూ....దారిలో కన్పించిన మిత్రుల్తో కాసేపు పిచ్చాపాటీ మాట్లాడి తమ దారిన తాము వెళ్ళిపోతున్నారు....

ఎంతో మంది....వచ్చే వాళ్ళు....వెళ్ళే వాళ్ళు.

శ్రీపతి యింకా యింటికి చేరలేదు. వీధి గుమ్మంలో పావుగంటసేపు నిల్చుని విసుగెత్తి లోపలి కెళ్ళబోయిన శ్రీపతి శ్రీమతి విశాల సుపరిచిత కంఠం విని ఆగి వెనుదిరిగింది. అనూరాధ రిక్షాలోంచి దిగుతోంది.

'రా, అనూరాధా; ఏమి టింత అకస్మాత్తుగా యిలా ఊడిపడ్డావ్ ?'

'మొదటి ప్రశ్న యిదా అడిగావ్ ? సరేలే: నేను యీ ఊళ్లో ఉద్యోగం వెలిగించబోతున్నా తెలుసా ? రిక్షావా డిచ్చిన చిల్లరను ప్లాస్టిక్ బాగ్ లో వడ వేసుకుంటూ అంది అనూరాధ.

'అనూరాధా' ఆశ్చర్యపడింది విశాల.

'ఎందు కలా ఆశ్చర్య పడతావ్ ? మొదట్లో నేను ఉద్యోగం చెయ్యటాని కాయన ససేమిరా ఒప్పుకోలేదు.... కాని యిప్పుడు తప్పనిస రయింది.'

'ఏం ? ఆయన ఉద్యోగం మానేసారా ?'

'ఆయ నెందుకు మానేస్తారు ?'

'మరి ?'

'నాతో కాపురం చేయటమే మానేశారు' తేలికగా నవ్వింది అనూరాధ.

'అనూరాధా: అయితే ?....'

'వాళ్ళ బుద్ధి చూపించుకున్నా రంతే: తరతరాలుగా మనం బానిసల మనే వాళ్ళ ఊహ యింకా వార సత్వం కావాలని కోరుకునే మగవాళ్లు చేసే పన్లింతేలే' రుమాలుతో ముఖం అద్దుకుంది.

'అంటే ?'

'అంటే: అదే: అనుమానాలతో అభాండాలు వేస్తూ ఆడదాని జీవితం అంధకారం చెయ్యటానికి, గుండెల మీద చెయ్యి వేసుకుని....దూరం ఆలోచించి, అవగాహన చేసుకొనే సంస్కార వంతు లెవరో తప్పితే....కనుచూపు దాటని ఊహాశక్తి గలవాళ్ళెవరూ వెనుదియ్యరు .... అందుకే మొదట్నుంచీ నాకు పెళ్ళంటే ఒక మంచి ఉద్దేశ్యం అంటూ లేదు....పద, లోపల కెళ్ళి కూర్చుందాం' అనూరాధ దారి తీసింది.

యిద్దరూ హాల్లో టేబులు ముందున్న కుర్చీల్లో ఒకరి పక్కన ఒకరు కూర్చున్నారు.

అనూరాధే తిరిగి మొదలెట్టింది. 'కల్మషం తెలియని పసిపిల్లలు చేస్తారే, బొమ్మల పెళ్ళిళ్ళు....అవే నయం.... యే అభాండాలకూ గురి కాకుండా... ఎవరి స్వార్థాలకూ బలి కాకుండా నిశ్చింతగా ఉంటాయ్ ఆ దంపతుల జంటలు.'

'నా కేం అర్థం కావటం లేదు' తలాతోకా లేని అనూరాధ సంభాషణ లోని అర్థం తెల్సుకోలేకపోయింది విశాల.

'ప్రాణంలేని ఆ బొమ్మల్లో లేని లక్షణాలన్నీ ప్రాణం ఉన్న మన యీ బొమ్మల్లో సలక్షణంగా ఉంటాయ్.'

నవ్వింది విశాల అనూరాధ మాటలకు.

'నవ్వులాట కాదు విశాలా! మానవుడు దేన్నో అందుకోవా లని ఆశించి, అవకాశం ఉన్నా ఆత్మస్థయిర్యం లేక, అందుబాటులో ఉన్నా పొందలేక మెదడుదాటని భావాలతో చివరి కెంత హీనస్థితికి దిగజారిపోతాడో అనూహ్యం' ఆవేశంగా అన్న అనూరాధ మాటలు మరీ ఆశ్చర్యపర్చాయి విశాలను.

'ఔను విశాలా! జీవితాలతో చెలగాటం కొందరికి సరదా — తమ సరదాల వెనుక కూలిపోయే సంసారాల గురించి ఆలోచించలేరు. వాళ్ళు.... తమ స్వార్థం జయించకపోతే....తన స్వార్థానికి పరాజయం సిద్ధించటానికి కారణం వారే అయిఉండికూడా .... లోకం మీద పిరుచుకుపడతారు? పక్వం చెందని పశుహృదయులు పగిలిపోయే గుండెల్ని చూసి పళ్ళికిలిస్తారు. హృదయ దౌర్బల్యాన్ని పరదాల క్రింద దాచే ప్రయత్నం చేస్తారు — ఫలితాలు దుర్భరం — అది వాళ్ళకానందం .... గౌరవం అనుకుంటారు వాళ్ళు.'

'అస లేం జరిగింది అనూరాధా?' ఎటూ ఓ నిర్ణయానికి రాలేక సతమతమౌతోంది విశాల.

'స్నేహాన్ని చులకనగా తీసుకుని ఆడది ఆటబొమ్మనే ఉద్దేశ్యంతో ప్రవర్తించటం కేవలం పశుత్వం కాక మరేమిటి? కల్సి చదువుకున్నాం - స్నేహంగా తిరిగాం - తర్వాత విడిపోయాం. మనోవాక్కాయ కర్మలా మా మనోనిగ్రహాన్ని పరీక్షించుకోవల్సిన విపరీత పరిస్థితుల్లో యేనాడూ చిక్కుకోలేదు. కల్సి ఉన్నంతకాలం-కాని, మా నాన్నగారికి ట్రాన్స్ఫర్ కావటంతో తప్పనిసరిగా ఆఊరు వదలి వెళ్ళవల్సివచ్చింది. అతను ఎడ్రస్ అడిగాడు .... యిచ్చాను .... ఆర్నెల్ల తర్వాత అతనిదగ్గర్నుంచి నాకో ఉత్తరం వచ్చింది-అప్పుడుగాని నాకు హృదయాలకుకూడా పైన ఒక బంగారపు పొర అంటించుకుని స్నేహాన్నభిలషించే సహృదయు లుంటా రని అర్థం కాలేదు.'

'ఏమని వ్రాశాడు?' విశాలలో ఆత్రుత హెచ్చింది.

'ఏమని వ్రాస్తేనేం? స్నేహితుడిగా మరొక వ్యక్తికి వ్రాసే సంగతులు నాకొక్కటీ అందులో కన్పించలేదు. హృదయాల్ని పరస్పరం అర్పించుకున్న ప్రేయసీప్రియులు వ్రాసుకునే ఉత్తరంలా ఉంది. యెలాంటి పరిస్థి

తుల్లో అత నా ఉత్తరం వ్రాసినా నా కనవసరం....అసహ్యంకూడా.'

'అయితే నువ్వేమయినా జవాబిచ్చావా?' విశాల అనూరాధ ముఖంలోకి చూస్తూ అడిగింది.

'నేనేం జవాబు వ్రాయలేదు. కాని మరో ఉద్దేశ్యం కూడ కలిగినమాట వాస్తవం. అతనెంతవరకూ నన్ను కోరడంలో నిలబడగల్గుతాడో తెల్సుకోవాలని.'

'యేం చేశావయితే నువ్వు?'

'తదనంతరం మేం కల్సుకున్నాం ఓనాడు .... నన్ను చూసి కంగారు పడ్డాడు....ముఖతః మాట్లాడలేనివాళ్లు ఉత్తరాల్లో 'సోదె' వెళ్ళబోస్తారు. అది మానవనైజం .... అయినప్పటికీ అడిగాను - అతని హృదయాన్ని పరీక్షించాను. అతను ఓడిపోయాడు - నన్ను పెళ్ళిచేసుకోలేనన్నాడనే నాకు జ్ఞాపకం. మా యెడబాటు సహించలేని

వ్యక్తి ఏ దృక్పథంతో నాకు ఉత్తరం వ్రాసినట్టు? కేవలం ప్రకృతిచర్యల ప్రభావాలకు నన్నొక ప్రతిమగా నిల బెట్టాలనే ఉద్దేశ్యంతో అతను నా హృదయానికి .... చివరకు నా స్నేహానికి దూర మయ్యాడు.... కాని కాచిఉండి పోటు పొడిచే నాగని తెల్సుకోలేక పోయాను. మా భార్యాభర్తల అనురాగాల పంటమధ్య 'అగ్గిపు'ల్లయ్యాడు. ఫలితంగా ఆ కార్చిచ్చు ఎదురుదెబ్బ కొడితేగాని మనుష్యుల్లో మానవత్వమనేది మేల్కోదు – యేది యేమయినప్పటికీ దాని ఫలితం ఒక్కటే నా ఉద్యోగా న్వేషణ. నాతో ఆయన సంబంధం త్రెంచుకున్నారు. అనూరాధ ముఖంలో విషాదం గూడు కట్టుకుంది.

విశాలకూడా బాధపడింది. యెలా సానుభూతిని సరఫరా చెయ్యాలా అని ఆలోచిస్తూంది

'ఏమిటాలోచిస్తున్నావ్ విశాలా?

'నీగురించే

నవ్వింది అనూరాధ- ఆలోచించాల్సిన అవసరం కొనితెచ్చుకోవటం యెందుకు? అవన్నీ పీడకల్లా మర్చిపోగల్గిన్నాడు యే ఆలోచనలకూ తావుండదు మాటల్లో నిర్లక్ష్యం ముఖంలో నిర్లిప్తతా అర్థంకాలేదు విశాలకు.

'సమ్మెట దెబ్బలకు సవాల్ చేసే హృదయా న్నిచ్చాడామెకు..లేకపోతే యిలాంటి విద్యుద్ఘాతాని కెలా తట్టు కోగల్గిం దామె.' విశాల మనస్సు గొణి గింది....హృదయం తేలికపడింది.

'వెళ్ళొస్తా విశాలా' అనూరాధ లేచింది.

'అదేమిటి, యెక్కడికి కెళ్తావ్.... రాత్రి యిక్కడుండిపో' విశాల బల వంతంచేసింది.

'లేదు-ఈ వీధికొసని మా మేనత్తగా రున్నారు-అక్కడకు వెళ్లిపోతాను. రేపు వస్తాలే.'

విశాల యింట్లోకెళ్ళి కుంకుమ తెచ్చి తను బొట్టు పెట్టుకుని అనూ రాధకు బొట్టుపెట్టింది.

అనూరాధ అదోలా నవ్వింది.

'ఇది మన సాంప్రదాయం - మనం యెంతగా మారిపోయినా సాంప్రదా యాల్ని మాత్రం మార్చ సాహసించ కూడదు.'

'పందొమ్మిదివందల అరవై మూడో సంవత్సరపు సీతమ్మవారు' మనసు లోనే అనుకుంది అనూరాధ.

ఇద్దరూ వీధి గుమ్మంలోకి వచ్చే సరికి విశాల భర్త శ్రీపతి యెదు రయ్యాడు....

అనూరాధ....తలెత్తిచూసి గతుక్కు మంది.

శ్రీపతి అనూరాధను చూసి ఉలిక్కి పడ్డాడు.

'మా వారు' పరిచయం చేసింది విశాల.

'నమస్తే' అప్రయత్నంగా చేతులు జోడించింది అనూరాధ.

'అనూరాధ-నా స్నేహితురాలు.'

'నమస్తే' శ్రీపతి ముఖం మాడి పోయింది.

'వస్తా' అనూరాధ గబగబ వెళ్ళి పోయింది. విశాల అయోమయంగా చూసింది.

శ్రీపతి అనూరాధ వెళ్ళిన వైపే చూస్తూ ముఖంలో మార్తున్న రంగులు గుర్తిస్తుందేమో విశాలని గదిలోకి వెళ్ళిపోయాడు. శ్రీపతి హృదయం రకరకాల ఆలోచనలతో నిండిపో యింది.

విశాల ఇంట్లోకి వెళ్ళబోతూండగా హాల్లో టేబుల్ మీద ప్లాస్టిక్ బాగ్ కన్పించింది. 'మర్చిపోయింది అనూ రాధ' అనుకుని తీసి జాగ్రత్త చేసింది. విశాల గదిలో అడుగు పెడుతూండ గానే అడిగాడు శ్రీపతి 'అనూరాధేం యిలా వచ్చింది.'

'అనూరాధ మీకు తెలుసా?' ఆశ్చర్యపోయింది విశాల.

శ్రీపతి జవాబివ్వలేదు.

'కలిసి చదువుకున్నారా?'

తృళ్ళిపడ్డాడు శ్రీపతి....

'అయితే మీకు బాగా తెలుసన్న మాట.'

'విశాలా, ఇంటికొచ్చినవాళ్ళంతా నాకు తెల్సినవారై నట్టు మాట్లాడుతావేం!' విసుక్కున్నాడు శ్రీపతి.

విశాల యింకేమీ మాట్లాడలేదు. ఫ్లాస్కులోంచి కాఫీ కప్పులో పోసి అందించింది.

మౌనంగా త్రాగేసి కప్పు అక్కడ పెట్టి లేచాడు.

'బయటి కెళ్తున్నారా ?'

'ఊ'

'రావటం ఆలస్యం అవుతుందా ?'

'చెప్ప లేను. నువ్వు భోజనం చేసెయ్. నాకోసం చూడకు' గబగబ వీధిలోకి నడిచాడు శ్రీపతి.

విశాలకు భర్త ప్రవర్తన యేమిటో అర్థంకాలేదు. రకరకాలుగా పరుగు లెత్తుతున్న ఆలోచన్లకు ఒక అంతంటూ కన్పించలేదు. అనూరాధ గుర్తొచ్చింది. 'పాపం' అనుకుంది. ఆఫీసు నించి యింటి కొచ్చి యిల్లు కదలని భర్త యీ రోజు యింత చీకటిపడ్డాక బయట కెందు కెళ్లారో ఊహించలేక పోయింది విశాల .... ఒంటరితనంలో ఆలోచనలు జంటలుజంటలుగా వస్తూనే ఉంటాయ్. అనూరాధ మర్చిపోయిన ప్లాస్టిక్ బాగ్ తెరచింది. ఐదు పది రూపాయల నోట్లు....కొంత చిల్లర ఉన్నాయ్ ... మరో రెండు యేవో కాగితాలున్నాయ్. తెరిచింది. క్రింద సంతకం చూసి గతుక్కుమంది. వణుకుతున్న చేతుల్తో... పెదవుల్తో....గబగబ ఆద్యంతం చదివింది. మిన్ను విరిగి తల మీద పడినట్టయింది. యథాప్రకారం కాగితాలందులో పెట్టేసి నీరసంగా కుర్చీలో వాలిపోయింది విశాల.

ప్రపంచం అంతా తలక్రిందులైనట్లు భయపడింది—'మా భార్యాభర్తల అనురాగాలపంట మధ్య అగ్గిపుల్ల' .... అనూరాధ మాటలు విశాల చెవుల్ని బ్రద్దలు చేశాయ్ .... కెరటాల్లాంటి ఆలోచనలు తరిగే దెప్పుడో మరి!

ఆ రాత్రి చాలా పొద్దుపోయేక యింటికి వచ్చాడు శ్రీపతి - ముఖం అంతా పీక్కుపోయినట్లు ఉంది-కళ్ళు ఎర్రగా ఉన్నాయ్.

విశాల మామూలు ధోరణిలో అడిగింది 'భోజనానికి వస్తారా ?'

'ఆకలిగా లేదు - కాస్త మజ్జిగ పట్టుకురా.'

విశాల తెచ్చి యిచ్చింది. 'అలా గున్నారేం ?'

మజ్జిగ త్రాగేసి గ్లాసు క్రింద పెడుతూ 'ఎలా ఉన్నాను ?'

'చాలా నీరసంగా ఉన్నారు-కొద్దిగా అన్నం తినండి - మంచివారు కదూ' లాలించబోయింది విశాల.

'చెప్తే నీక్కాదూ, నన్నాళ్టే విసిగించక పెళ్ళపతలకు.'

'యెందు కంత కోపం?'

తీవ్రంగా విశాల ముఖంలోకి చూసి తిరిగి తల తిప్పేసుకున్నాడు.

విశాల యేదో అడగబోయింది. కాని ధైర్యం చాలలేదు .... వెళ్ళి వాకిట్లో యీజీఛైర్లో కూర్చుంది.

శ్రీపతి కిటికీలోంచి ఆకాశంలోకి చూస్తున్నాడు. నక్షత్రాలు మిలమిలా మెరుస్తున్నాయ్ .... అక్కడక్కడ చిన్నచిన్న మబ్బుతునకలు....చిన్నగా గాలివేస్తోంది. శ్రీపతిలో పెనుతుఫానేదో చెలరేగుతోంది. ఆలోచనల కో హద్దంటూ లేకుండగా గజిబిజిగా బుర్రలో పల్టీలుకొడ్తున్నాయ్. 'యింటి కొచ్చినవాళ్ళంతా నాకు తెల్సినవారైనట్టు మాట్లాడతావేం?' తన మాటలు తన చెవులచుట్టూ చక్కర్లు కొడుతున్నాయ్-తను అబద్ధమాడేడు. అనూరాధను తన కెప్పట్నుంచో తెల్సు. కాని విశాలముందా విషయాన్నెలా ఒప్పుకోగలడు తను? వర్తమానాన్ని అదిమిపట్టి గతం పైకి ఉబికింది.

బి.ఎ. వరకూ అనూరాధా తను కలిసి చదువుకున్నారు - అదీ ఇంటర్లో తను ప్రవేశించేకే అనూరాధతో పరిచయమైంది. ఇద్దరూ ఒకింట్లోనే ఉండేవారు. అనూరాధకు తల్లిలేదు-తండ్రి ఎలక్ట్రికల్ డిపార్ట్మెంటులో అకౌంటెంటుగా ఉండేవాడు - అనూరాధకు మరో యిద్దరు తమ్ముళ్ళుండేవారు. పెద్దవాడు విశ్వం .... రణపెంకి .... రెండోవాడు నగేష్బాబు. అమాయకుడు....అనూరాధ తండ్రికి ఆ యిద్దరు కుర్రాళ్ళూ రెండుకళ్ళు .... అనూరాధ అతని హృదయమే - ఆయనకూడా చాలా సహృదయతగా మాట్లాడేవాడు .... ఆయ నెన్నో విషయాలమీద మాట్లాడే మాటలు నిజానికి బాగాఅందుబాటులో ఉండేవి. ఆయనకు సాముద్రికంగూడా తెల్సని నల్లురైదుగు రనగా తను విన్నాడు. చదరంగం బాగా ఆడుతాడని....దిట్టమైన చెయ్యనికూడా తను విన్నాడు....తనని యెంతో ఆప్యాయంగా పలకరించి నాటి విద్యావిధానాల్లో చేయవల్సిన మార్పులూ .... విద్యార్థుల కందరికీ ఉన్నతవిద్య నభ్యశించటానికి ప్రభుత్వం ఎలా ఏర్పాటు చేస్తే బాగుంటుందో .... అన్నీ వివరించేవారు - ఆత్మవిశ్వాసంతో చేసే యే కృషికైనా ఫలితం అనుకున్న దానికి పదింతలు పొందగల మన్నారు. ఆయన మాటలు యింకా యింకా వినాలని ఉండేది-తర్వాత సినిమాలు-నాటకాలు .... జానపదగేయాలు .... ఎన్నిటిగురించో మాట్లాడేవారు-అనూరాధకూడా తనతో యెంతో చనువుగా మాట్లాడేది. యిద్దరు వివిధ విషయాల్లో వాదించుకునేవారు -

"నీకు పుణ్య ముంటుంది. కుర్రవాడిముందు నా తల పగలగొట్టవద్దు. వాడు బుర్రలోపల చూశా డంటే మర్యాద దక్కదు."

యెప్పుడూ అనూరాధే గెలిచేది - అయినా హృదయాల్లో ఏ యీర్ష్యా సూయలు ప్రవేశించినట్టు తనకుజ్ఞాపకం లేదు....తనకు అనూరాధ కన్పించక పోతే యెంతో దిగులుగా ఉండేది. అనూరాధ స్వరూపాన్ని తప్పిస్తే దేంట్లోనూ దేన్నీ చూడలేకపోయాడు తను. ఫైనల్ ఇయర్‌లో ఉండగానే అనూరాధ తండ్రికి విజయవాడ ట్రాన్స్‌ఫర్ అయింది.

తర్వాత రెండు మాసాలవరకు అనూరాధ....విశ్వం...నగేష్‌బాబు.... తనూ కలిసేఉన్నారు. పరీక్షలనంతరం అనూరాధ తన తమ్ముళ్ళతో విజయవాడ బయల్దేరింది. తను ఎడ్రస్ అడిగాడు. ఇచ్చింది అనూరాధ. తనలో యేదో తెలియని బాధ ఆవేశించింది. అనూరాధ వెళ్ళిపోయిన దగ్గర్నుంచీ మనస్సంతా అల్లకల్లోల మయినట్లయింది తనకు....ఎలాగైనా తను అనూరాధను పొందాలి....పొందలేకపోతే పరిణామా లెలా ఉంటాయో తనూహించలేదు .... కాని ఎలా? సాహసించి చెప్పే ధైర్యం లేదు తనకు....కాలం తన మామూలుగా ఆర్నెల్లను గుటుక్కున మింగింది— తెగించి ఆనాడు అనూరాధకు ఉత్తరం వ్రాసాడు తను.

గాలికి కిటికీతలుపు కొట్టుకుంది— ఉలిక్కిపడి తిరిగి ఆలోచనల్లో మునిగి పోయాడు.

'ఏమిటి? ఏమిటి వ్రాశా నా ఉత్త రంలో ?' తీవ్రంగా ఆలోచిస్తూ గొణు క్కున్నాడు, తన జ్ఞాపక శక్తిని నిందించుకుంటూ.. 'ఆ...గుర్తొచ్చింది. తను వ్రాసిన ఉత్తరంలోని ప్రతీ మాటా నాకు జ్ఞాపకం ఉంది....'

'ప్రియమైన అనూరాధా'

ఏమని వ్రాయమంటావ్ ? ఎలా వ్రాయమంటావ్ ? సౌందర్యాన్ని కళాతపస్వి ఆరాధిస్తాడు—ప్రేమికులు వెన్నెల రాత్రుల్ని కోరుకుంటారు. మయూరాలు మబ్బులకోసం మధన పడతాయ్....భక్తుడు సృష్టికర్త పద సన్నిధిలో రేణువు కావాలని ఆశి స్తాడు. తన భావనలకు రూపకల్పన చెయ్యాలని చిత్రకారుడు తపించి పోతాడు. పరిమళపుష్పాల్లోన్ని మక రందాన్ని తనివితీరా గ్రోలడానికి తుమ్మెదలు తహతహలాడుతాయ్ ? ఏమిటీ అనుబంధం? ఏమిటా సంబంధం.... నేను నీ సమక్షాన్ని కోరు కుంటున్నాను. ఏమని చెప్పమంటావ్? నాకంతా అంధకారంగా కన్పిస్తోంది. నా హృదయం తెగిన గాలిపటంలా నిర్ణయంలేని పరిధుల్లో పల్టీలు కొడు తూంది. చివరికే చెట్టుకొమ్మకో తగులుకుని ధ్వంసం అయిపోతుం దేమో? ఏమో: ఇంతకంటె ఏం వ్రాయాలి ? ఎలా వ్రాయాలి ? అర్థం చేసుకో: జవాబుకోసం అనుక్షణం ఎదురు చూస్తూంటాను.

- శ్రీపతి'

తర్వాత నెలల తరబడి తను అనూ రాధ జవాబుకోసం ఎదురుచూశాడు. కాని తన ఆశ నిరాశే అయ్యింది. తన ఆలోచనలు పరిపరివిధాల పరుగులు తీసాయ్.

నిజం....తనొక పిరికివాడు.... మూర్ఖుడు....ముఖతః ఏనాడూ అనూ రాధను యీ విషయం గురించి తను అడగలేకపోయాడు. అదృష్టం దూరమయ్యాక ఆవేదన పడటం ప్రకృతి సహజమేమో ? ఛీ....తనకు ధైర్యంలేదు-జీవితం అంటే ఒక దృఢ నిశ్చయం లేదు... కాలం ఆగలేదు. చావు పుట్టుకలమీద అడుగులేసు కొంటూ నడిచి వెళ్ళిపోతూనే ఉంది.

ఆ సంవత్సరం అనూరాధ 'కాన్వ కేషన్'కు విశాఖపట్నం వచ్చింది. శ్రీపతి కూడా వెళ్ళాడు....ఎప్పటి లాగే అనూరాధ శ్రీపతిని నవ్వుతూ పలకరించింది.

'ఉత్తరం అందే ఉండదు బహుశః :' మనసులోనే అనుకున్నా తిన్నగా ఆమె ముఖంలోకి చూడలేకపోయాడు శ్రీపతి.

యోగ క్షేమాలడిగింది.—

'సాయంత్రం శాంతి భవన్ కు రండి: తీరుబడిగా మాట్లాడు కుందాం.' ఎప్పటి చనువుతోనే మాట్లాడి వెళ్ళిపోయింది అనూరాధ.

శ్రీపతి హృదయం తేలికపడింది.

సాయంత్రం కోసం ఎదురు చూసాడు .... కాలం స్థంభించిపోయి నట్టు బాధపడ్డాడు. కష్టసుఖాల్ని కొలతలు వేసుకుంటూ నిర్విరామంగా సాగిపోతూనేఉంది కాలం.

సాయంత్రం ఐదున్నరకల్లా శాంతి భవన్ చేరుకున్నాడు.

అనూరాధ శ్రీపతికోసమేయెదురు చూస్తూంది. వెళ్ళగానే ఆహ్వానించి కుర్చీ చూపించింది.

శ్రీపతి కూర్చున్నాడు.

కాఫీ యిచ్చింది.

మౌనంగా త్రాగేశాడు.

'యింకా పై చదువులు చదువుతారా ?' అనూరాధే మొదలుపెట్టింది.

'చెప్పలేను.'

'అదేం ?'

'చదవాలనే ఉంది. కాని నాన్నగారు వచ్చే సంవత్సరంలో రిటైరయిపోతారు. యీలోగా నేనేదో ఒక ఉద్యోగం సంపాదించాలని చూస్తున్నాను.'

'మంచిదే.'

'మరి నువ్వు ?'

'అవకాశం, అదృష్టం ఉన్నంత మేరకు చదవటమే నేను చేయదల్చుకుంది.'

శ్రీపతి యేం మాట్లాడలేదు.

'మీ ఉద్దేశ్యం ఏమిటి ?'

ఏం చెప్పాలో అర్థంకాలేదు శ్రీపతికి.

'జవాబు చెప్పలేరా ?' అనూరాధ అడిగింది సూటిగా.

'మీ ఉద్దేశ్యం మంచిదే;' యేదో ఒక జవాబు తను చెప్పాలి. చెప్పాడు.

అనూరాధ నొసలు చిట్లించింది.

'అదృష్టం అందరికీ కలిసిరావాలిగా అనూరాధా.'

'ఏ మదృష్టం ?'

'పై చదువులు చదువుకోనే అదృష్టం.'

శ్రీపతి ముఖంలోకి చూసింది మౌనంగా.

'అలా గయ్యారేం ?'

జవాబు చెప్పలేదు అనూరాధ. తన డైరీలోంచి ఒక కాగితాన్ని తీసి అందించింది శ్రీపతికి.

శ్రీపతి వ్రాసిందే అది. శ్రీపతి హృదయంలో తిరిగి పెనుతుఫాను ప్రళయార్భాటాలతో రేగింది.

'యేమిటి దీనర్థం ? మీ ఉద్దేశ్యం ఏమిటి ?'

'యేం చెప్పమంటావ్ అనూరాధా ?'

'అంత సమాధానం చెప్పలేనివా రుత్తరం ఎందుకు వ్రాశారు? ఏ భావంతో మీ రలా వ్రాశారు?' తీక్షణంగా ఉంది అనూరాధ కంఠం.

'అర్థం చేసుకోలేదా అనూరాధా! నిన్ను....'

'పెళ్ళి చేసుకుంటారు కదూ?'

'ఔ' నన్నట్లు తలూపాడు శ్రీపతి.

'నా గురించి ఏం తెల్సుకున్నారు మీరు?'

మాట్లాడలేదు శ్రీపతి.

'ఈనాటికీ నన్ను వివాహమాడాలనే ఉద్దేశ్యం ఉందా?'

'ఉంది.'

'కాని మీ రెప్పుడైనా మా నాన్నగారితో మాట్లాడేటప్పుడు....ఆయన నవ్వుతూ మాట్లాడే మాటల వెనుక అగాధమయిన విషాదం వుందని గ్రహించారా? పోనీ నాలో కూడా గూడుకట్టుకున్న దుఃఖాన్నంతా ఎప్పుడైనా తెల్సుకున్నారా?

'అనూరాధా!'

'నేను భర్తృవిహీనను.'

ప్రపంచం అంతా భగ్గున మండినట్లయింది. ఉలిక్కిపడ్డాడు....తల తిరిగిపోతూంది....

'నన్ను పెళ్ళి చేసుకోలేరుకదూ?' దీనంగా అడిగింది అనూరాధ.

'అసాధ్యం అనూరాధా.'

'హుఁ. అసాధ్యం కాదు మిస్టర్ శ్రీపతి-అవివేకం-అజ్ఞానం..అల్పత్వం!'

'అనూరాధా!'

'పరువుగా బ్రతికే స్త్రీజాతి మీద మీకెందు కింత కసి? స్నేహాన్ని అలుసుగా తీసుకుని హద్దులేకుండా ప్రవర్తించటంలో మీ వుద్దేశ్యం? యీ వుత్తరం మా నాన్నగారి చేతుల్లో పడితే నా గతేమయ్యేది-నిప్పు లేందే పొగ రాదని అపోహపడరూ? చదువూ, సంస్కారంవున్న మీరే యిలాంటి పన్లు చేస్తే....అవి లేనివాళ్ళు చేసారంటే అనగలిగే దేముంది?'

శ్రీపతి మౌనంగా ఉండిపోయాడు.

'ఏ పనయినా చేసేముందు కళ్ళు మూసుకుని ఒక్కక్షణం ఆలోచించగలిగితే యీ పని మీరు చేసేవారు కాదు. ముఖతః మాట్లాడలేని పిరికివారు వుత్తరం వ్రాయటం దేనికి?'

'అనూరాధా!'

'అని పిల్చే అర్హతను కూడా పోగొట్టుకుందామనా? స్నేహాన్నింత చులకనగా తీసుకొని మీ అవివేకానికి బలిచేస్తా రనుకోలేదు. మీ ధైర్యం మీ భావాలూ కొలత కందుతా యనుకోలేదు. స్నేహాన్ని తృణంగా తీసుకుని ఆత్మీయతకు 'ప్రేమ' అని పిచ్చి పేరు పెట్టే మీలోని 'జడత్వాని'కి మా శీలం బలి చేసుకొనేంత మూర్ఖులం కాదు. వెళ్ళండి.'



"నీమాదిరిగా కసరత్ చేసి లావు కావా లని నాకూ వుంది. కాని, గుడ్డలఖర్చు ఎక్కడినుంచి తేవా లని ఆలోచిస్తున్నా !"

అవమానభారంతో మెల్లగా అడుగులు వేసుకుంటూ బయటకొచ్చిన శ్రీపతికి గదిలో నాలుగైదు ఆడగొంతుల పకపకలు, శ్రీపతి హృదయాన్ని దహించినై. ఒక నిశ్చయానికొచ్చినట్టు తల పంకించి చర....చర ముందుకు సాగిపోయాడు శ్రీపతి.

* * *

భావాతీత మయిన సంఘటనలవల్ల మానవుడు మూడు విధాలుగా మారిపోతాడు. యీ ప్రపంచంలోని నైతిక సుఖా లన్నిటికీ దూరమయి ఒక మహాదాశయంతో భగవత్సన్నిధి చేరా లని తపస్వి కావచ్చు.

పిచ్చివాడు కావచ్చు....

క్రూరత్వానికే తన హృదయాన్ని అంకితం చెయ్యొచ్చు....ప్రతీకారం...పశుత్వం తప్ప మానవత్వం తెలియని మూర్ఖుడుగా మారవచ్చు.

ఓనాడు వచ్చిన శుభలేఖను వెంటనే అగ్గిపుల్ల వెలిగించి తగులబెట్టాడు శ్రీపతి-'మీ జీవితాల పంటలో అగ్గిపుల్ల నౌతా నన్నాడు.' ఆవాదే-హృదయం ఎగిరి గెంతేసింది-తనలోని వుబుకుతున్న అక్కసు నంతా వెళ్ళబోస్తూ అనూరాధ భర్తకు ఉత్తరం వ్రాసాడు కొన్నాళ్ళు పోయాక. ఫలితాలకోసం శ్రీపతి ఎదురుచూస్తున్నాడు....

గోడ గడియారం పదకొండు కొట్టింది - శ్రీపతి ఆలోచన్ల లోంచి తేరుకున్నాడు....

విశాల యీజీ చైర్లో నిద్ర పోతోంది.

దీప మార్పేసి మంచం మీద వాలాడు శ్రీపతి.

* * *

రాత్రంతా శ్రీపతికి సరిగ్గా నిద్దర పట్టలేదు. ఉదయం లేచేసరికి కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయ్. ముఖం పీక్కు పోయినట్టుంది. బద్ధకంగా పెరట్లోకి వెళ్ళి ముఖం కడుక్కున్నాడు. వచ్చి గదిలో కూర్చున్నాడు.

విశాల కాఫీ తెచ్చిచ్చింది. 'రాత్రి నిద్రపట్టలేదా ?' అంది.

'లేదు' కాఫీ సాసర్లో పోసుకుని తాగడాని కుపక్రమించాడు.

'పాపం....మా స్నేహితురాలు.'

సాసరు టేబుల్ మీద పెట్టి ఆతృతగా ఆమె ముఖంలోకి చూశాడు.

'ఏమయింది ?'

'ఎవరో ఏమో ? దాని కాపురంలో చిచ్చు పెట్టారట.'

'తన బాణం గురి తప్పలేదన్న మాట;' మనసులోనే అనుకున్నాడు- సంబర పడ్డాడు. పైకి మాత్రం .... 'ఆ సంగతి మధ్య మన కెందుకులే' అన్నాడు....

'ఎంతయినా స్నేహితురాలు కద.' 'కావచ్చునుకో. ఆc. సెలక్ట్ లో మంచి సినిమా వచ్చింది తెలుసా.' ధోరణి మార్చే వుద్దేశ్యంలో అన్నాడు శ్రీపతి.

'అనూరాధ జీవితమే ఒక సినిమా అనిపించింది నాకు. విశాల మాటలకు విసుక్కున్నాడు శ్రీపతి.

'ఇంతకూ మీకు అనూరాధ యిదివరలో తెలీదు కదూ' సూటిగా ప్రశ్నించింది విశాల,

'తెలీదు' నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు శ్రీపతి.

'పొరపడ్డానులెండి.'

'ఏమిటది ?'

'దాని కాపురంలో నిప్పు పుట్టించడానికి ఉత్తరం వ్రాసినాయన పేరూ మీ పేరూ ఒకటేలెండి.'

'విశాలా !' నిర్విణ్ణుడై పోయాడు శ్రీపతి.

'అయినా లోకంలో ఆ పేరుగలవాళ్ళెంతోమంది ఉంటారు. శ్రీపతి ముఖంలోకి చూస్తూనే అడిగింది విశాల.

శ్రీపతి తల తిరిగిపోతూంది.

'ఇదంతా పాఠం నేర్పినందుకు ప్రతీకారంటలెండి.'

'విశాలా !' బాధగా అరిచాడు.

'ఎందుకలా బాధపడతారు ? ఒక ఆడదాని బ్రతుకును నాశనం చెయ్యటానికి భయపడనివాడు ఒక కాపురాన్ని కూల్చివేయటానికి వెరువని

వారు .... వెనుదీయనివారు .... అవ మానం పొంది ప్రతీకారం తీర్చుకునే వారు....'

'విశాలా!' పిచ్చిగా అరిచాడు శ్రీపతి.

'బాధపడతారుగాని .... ఎవరో అనూరాధ కాపురంగురించి ... మధ్య మీరు బాధపడటం దేనికి? దీని వెను కేమైనా కథుందా?' భర్త ముఖ కవళికలను పరీక్షిస్తూంది విశాల.

'లేదు—యేమీలేదు—వెళ్ళు ....నా మన స్సేం బాగులేదు.... వెళ్ళు....'

'వెళతాను — మీ హృదయం ఒక నాటికి చిత్రహింసకు గురి అవుతుందని మీకూ తెల్సు.'

'విశాలా.'

'యీ వుత్తరం సంగ తేమిటి?'

'ఏమి టా వుత్తరం?'

'చదవండి' అందించిం దో వుత్తరాన్ని.

'ప్రియమైన విశాలా.

నువ్వెంత మోసపోయావ్? శ్రీపతిని వివాహం చేసుకుంటున్నావని తెల్సిననాడే చాలా బాధపడ్డాను. కాని ... శ్రీపతి కమల కేం సమాధానం చెప్తాడు యిప్పుడు వారిని నీ వారిగా చేసుకోవటానికి ఎప్పటికీ ప్రయత్నిస్తూ ఉండు ....

నీ హితాభిలాషిణి. లత.'

''ఎంత చక్కటిరాత్రి! మనం భార్యాభర్తలం కాకుండా ప్రేమికులమయి ఉంటే ఎంత బాగుండేది!''

'అబద్ధం... అబద్ధం' పిచ్చిగా జుత్తు పీక్కుంటూ అన్నాడు. 'ఆ కమల ఎవరో నాకు తెలీదు... మోసం....దగా....'

శ్రీపతి చేతిలోంచి జారిపోయిన ఉత్తరాన్ని జాగ్రత్తచేస్తూ...

'అన్నీ తెలిశాకకూడా మీతో ఎలా ఉండమంటారు ?'

'విశాలా!' మన సంసారంలో ఎవరో చిచ్చుపెడుతున్నారు .... నాకేం తెలియదు.... నన్ను నమ్ము.... యే క్రూరదైవమో మనల్ని పీడిస్తోంది. యీ పాపానికి వాళ్ళు మిడతల్లా మాడిపోతారు – సర్వనాశనం అయిపోతారు – నా సంసారాన్ని కూలద్రోయటాని కెవరో యీ ఉత్తరం వ్రాశారు. విశాలా .... నువ్వూ ఆ ఉత్తరాన్ని నమ్ముతున్నా వన్నమాట.' వెర్రి ఆవేశంతో .... భయంతో .... పిచ్చిగా యిల్లంతా పచార్లు చేస్తున్నాడు శ్రీపతి.

'యెందుకలా ఆవేశపడతారు ? కాపురాల్లో చిచ్చుపెట్టటం ఒక్కొక్కళ్ల కదో ఆనందం-పండుగ.'

'విశాలా !'

'ఈ ఉత్తరం చూడండి!' శ్రీపతి అనూరాధకు వ్రాసిన ఉత్తరం అందించింది విశాల. ఉత్తరం చూసి నిర్ఘాంతపోయాడు శ్రీపతి. లోకమంతా ... ప్రకృతి సర్వం .... యేకమై తన మీదకు దాడిచేస్తున్నట్టు – ప్రచండ కాగడాలు తన హృదయాంతరాళాల్లో గడ్డకట్టిపోయిన కల్మషాన్ని కరిగించటానికి తన పైకి ఉరుకుతున్నట్టు-శ్రీపతి హృదయం భయంకర యుద్ధానికి గురియైన క్షోభతో గగ్గోలు చేస్తోంది.

'విశాలా .... నేను పాపిష్టివాణ్ణి' దుర్మార్గుణ్ణి! నిష్కళంకమైన మీ స్నేహా న్నపార్థం చేసుకుని నీచంగ ప్రవర్తించాను - నాకు శాంతిలేదు. విశ్రాంతిలేదు. నా పాపం నన్ను నిలువునా దహించివేస్తోంది. అనూరాధ నన్ను క్షమించగల్గిననాడుతప్ప నాకు జీవితమే లేదు-అనూ రాధా-అనూ... తక్కున ఆగిపోయాడు వస్తూన్న అనూరాధను చూసి.

'అనూరాధా! నన్ను క్షమించగలవా ?' శ్రీపతి దీనంగా అడిగాడు

'మీ హృదయంలో కల్గిన పరివర్తన చాలు శ్రీపతిగారూ-మిమ్మల్నెవరూ క్షమించనక్కర్లేదు. పశ్చాత్తాపం పాపాలను ప్రక్షాళనం చేస్తుంది. మీరిలా తయారవుతారని నే నెప్పుడూ అనుకోలేదు శ్రీపతిగారూ!'

'అనూరాధా !'

'ఒక్కమాట, మీరనుకొన్నట్టు.... నేను చెప్పినట్టు .... నా భర్త అంత సంకుచిత హృదయుడు కారు – మీ ఉత్తరాన్ని చూసి. 'ఎవరో రౌడీతనానికి వ్రాశారు—బాధపడకు అనూరాధా!' అన్నారు. కాని నా హృదయంలోంచి ఆ విషయం అంత త్వరగ కదల్లేను—విషయం తేల్చకుండా వుని నిశ్చయించుకుని బయలుదేర వచ్చాను నా ఆశ నెరవేరింది.'

'నీ ప్లాస్టిక్ [illegible] పోయావ్' విశాల అందించింది.



"ఒరేయ్ — ఈ పెద్దాళ్ళు చేసేదంతా ఒట్టి మోసంరా ! పళ్ళకుపళ్ళు వాళ్ళు తింటారు, మనకి సగంసగం ముక్కలు పెడ్తారు — ఇలాగే అన్నీ..."
"నిజంవేరా — మొన్న మా నాన్న తన కేంవో నిండుటిక్కట్టు కొనుక్కొని — నన్నేమో అరటిక్కట్టుమీద రైలెక్కించి తీసుకొచ్చాడు !..."

అనూరాధ తీసుకుంది.

'మర్చిపోవా లనే మర్చిపోయావ్ కదూ ?' విశాల అడిగింది.

సమాధానంగా ఒక నవ్వు నవ్వి ఊరుకుంది అనూరాధ.

'చూసుకో అమ్మా నీ డబ్బు.'

'ఫరవాలేదులే, అందులో ఉన్న వన్నీ కోయంబత్తూరు నోట్లు.'

ఆశ్చర్యపోయింది విశాల.

'అనుమానమైతే చూడు' తీసి చూపింది అనూరాధ. అందులో వున్న రెండో కాగితాన్ని తెరచి చూసి నిశ్చేష్టురాలై 'ఇదేమిటి' అంది.

విశాల గర్వంగా అనూరాధ ముఖంలోకి చూసింది.

అనూరాధ కంతా అర్థమైంది. లత పేరుతో విశాల తనకు తనే వుత్తరం వ్రాసుకున్న సంగతి శ్రీపతికి తెలియక పోవటమే మంచిదని మడిచి 'బాగ్'లో పెట్టేసింది. 'వస్తా'అనూరాధ కదిలింది.

శ్రీపతీ-శ్రీపతి శ్రీమతి విశాలా వీధిగుమ్మం వరకూ సాగనంపారు అనూరాధను. విశాల భర్త హృదయంలోకి సూటిగా చూసింది. శ్రీపతి హృదయం చివుక్కుమంది. సిగ్గుతో, అవమానంతో కుంచించుకుపోయాడు.

'ఏమండీ' భర్త హృదయంలో తల దాచుకుంది విశాల.

తేలికయిన మనస్సుతో గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు విశాలను.

విశాల బుగ్గలు ఎరుపెక్కాయ్. ఆ యిద్దర్నీ చూస్తూ చిరుగాలికి ఊయల్లూగుతున్న గులాబీ ఫక్కున నవ్వింది.